క్లుప్తంగా

రేపు ఆలయ భూముల కౌలుకు వేలం

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ఆలయాలకు చెందిన భూముల బహిరంగ వేలం పాటను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కార్తీక్ శనివారం తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ పార్వతీ సమేత తాండవ మల్లేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానాలకు చెందిన భూములను ఏప్రిల్ 1న బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. రెండు ఆలయాలకు చెందిన 58 ఎకరాల భూమిని కౌలుకోసం వేలంపాట వేయనున్నట్లు పేర్కొన్నారు.

చంద్రారెడ్డి మృతి తీరని లోటు



శావోలు చంద్రారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: వైఎస్సార్‌సీపీ నాయకులు శావోలు చంద్రారెడ్డి మృతి తీరని లోటని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 10వ వార్డులో గుండెపోటుతో మృతి చెందిన శావోలు చంద్రారెడ్డి మృతదేహానికి సిద్ధార్థరెడ్డి, చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు వారు సంతాపం ప్రకటించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. మున్సిపల్ దాసి సుధాకర్‌రెడ్డి, కౌన్సిలరు మండడి వాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు వీఆర్ శ్రీను, రవీంద్రారెడ్డి, రఘునాథరెడ్డి, శేషిరెడ్డి, రామ్మూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం

పాములపాడు: మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని వేంపెంట గ్రామంలో నాగేశ్వరరెడ్డి(42) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి



బిజినవేముల గ్రామస్తులతో మాట్లాడుతున్న సర్పంచ్ రవియాదవ్

నందికొట్కూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, బిజినవేముల సర్పంచ్ రవియాదవ్ అన్నారు. శనివారం బిజినవేముల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన వార్డు మెంబర్ యేసురత్నం తెలుగుదేశం పార్టీలో చేరారని తప్పుడు ప్రచారం చేయడం ఆ పార్టీ నాయకులకు తగదన్నారు. తెలుగుదేశం పార్టీలో చేరాల్సిన కర్మ తమ పార్టీ నేతలకు లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి



కారులోని లగేజీని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ

పాములపాడు: ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఆత్మకూరు సీఐ నాగభూషణ్ అన్నారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు నిబంధనలకు విరుద్ధంగా రూ.50వేలకు మించి నగదు ఉండకూడదన్నారు. అంతకు మించి నగదు తీసుకెళ్తున్నట్లయితే తప్పని సరిగా సంబంధిత రశీదులు చూపించాల్సి ఉందని చెప్పారు. ఆయన వెంట ఎస్‌ఐ అశోక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కుక్కల దాడిలో దుప్పి మృతి!

మహానంది: మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో తెలుగుగంగ కాల్వ వద్ద దుప్పిని కుక్కలు వెంటాడి చంపిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. నీరు తాగేందుకు వచ్చిన దుప్పిని కుక్కలు వెంటాడినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న మహానంది అటవీ సిబ్బంది సమీపంలో గాలించారు. అయితే మృతి చెందిన దుప్పి ఆచూకీ లభించలేదని ఎఫ్‌బీఓ ప్రతాప్ తెలిపారు.

వేసవి దుక్కులు తప్పనిసరి

పాములపాడు: వేసవి కాలంలో పొలాల్లో లో దుక్కులు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి సూచించారు. వాలుకు అడ్డంగా దున్నుకోవాలని చెప్పారు. పురుగులు కోశస్థ దశలో బయట పడటం వలన సూర్యరశ్మికి చనిపోతాయని తెలిపారు.

అంగన్‌వాడీల్లో ఆంగ్ల బోధన

- అంగన్‌వాడీ కేంద్రాల్లో సమూల మార్పులు
- ప్రీ స్కూళ్ల ఏర్పాటుతో ఆంగ్ల విద్యకు శ్రీకారం
- అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ
- హర్షం వ్యక్తం చేస్తున్న చిన్నారుల తల్లిదండ్రులు



బొమ్మలను చూపించి పిల్లలకు ఇంగ్లిషులో బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

నందికొట్కూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మూడేళ్ల ప్రాయం నుంచి తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమాన్ని అభ్యసించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల మాధ్యమాన్ని బోధించేందుకు అంగన్‌వాడీ టీచర్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. పుస్తకాలు ముందుంచి బోధించే కన్నా బొమ్మలతో అర్థమయ్యే రీతిలో చిన్న చిన్న పదాలను ఉపయోగించి ఆంగ్లాన్ని బోధిస్తూ ముందుకు వెళ్తున్నారు. దీనివల్ల చిన్నారులు ఐదో తరగతి పూర్తయ్యే నాటికి తెలుగు మాదిరిగానే ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడే స్థాయికి చేరుతారు.

2022లో ప్రీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు

అంగన్‌వాడీ కేంద్రాలన్నీ 2022లో ఫిబ్రవరి ఒకటి నుంచి వైఎస్సార్ ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా రూపాంతరం చెందాయి. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1663 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో 1,15, 539 మంది చిన్నారులున్నారు. 0–3 ఏళ్లలోపు పిల్లలు–74, 550 ఉన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 287 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 6,307 మంది మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో 250 అంగన్‌వాడీ కేంద్రాలు 5,068 మంది 3–6 ఏళ్ల చిన్నారులు ఉన్నారు. మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు చిన్నారులు–40,989 ఉన్నారు. మూడేళ్లకు పైబడిన చిన్నారులకు ప్రైమరీ, నాలుగేళ్లు పైబడిన చిన్నారులకు నర్సరీ, ఐదేళ్లు పైబడిన చిన్నారులకు యూకేజీ తరగతులు నిర్వహించి ఆంగ్ల మాధ్యమాన్ని బోధిస్తున్నారు. అందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ సచివాలయ మహిళ సంరక్షణ కార్యదర్శులకు గతంలో శిక్షణ ఇచ్చారు. దీంతో ఆట, పాట, మాట, సృజనాత్మకత, సంసిద్ధత, కథ అనే అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ సులభతరమైన రీతిలో చిన్న, చిన్న ఆంగ్ల పదాలతో విద్యా బోధన చేస్తున్నారు.

చిన్నారుల్లో ఉత్సహం నింపే దిశగా

అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో ఉత్సాహం నింపే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు తెలుగు, ఆంగ్లంలో నీతి కథలను వివరించడంతో పాటు బొమ్మలను చూపించి పదాలను పలికిస్తున్నారు. ఐసీడీఎస్ సూచనల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు బొమ్మలు చూపించి ఆటపాటలు, బోధన చేయడం జరుగుతోంది. అలాగే చిన్నారులకు మరింతగా అలరించే విధంగా ప్రభుత్వం యూట్యూబ్ చానల్‌ను రూపొందించడం జరిగిందని అధికారులు చెబుతున్నారు.



బొమ్మలతో ఆటలు ఆడిస్తున్న అంగన్‌వాడీ టీచర్

చిన్నారులకు ఆంగ్ల బోధన



అంగన్‌వాడీ చిన్నారులకు తెలుగుతో పాటు ఆంగ్ల మాధ్యమంలో బోధన అందిస్తున్నాం. చిన్నారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరిస్తూ ప్రీ ప్రైమరీ పాఠశాలలుగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం మార్చడం జరిగింది. బొమ్మలను చూపించి ఆంగ్లంలో బోధన అందిస్తున్నాం.

– కోటేశ్వరమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ, నందికొట్కూరు ప్రాజెక్టు

నా బిడ్డ ఇంగ్లిషు చెబుతుంటే ముచ్చటగా ఉంది



నా బిడ్డ ఏబీసీడీలు చెబుతుంటే నాకు ఎంతో ముచ్చటగా ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంగ్లిషు మీడియం అమలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లే మా ఇంటి పక్కన పిల్లలు ఇంగ్లిషులో పలుకుతూ, రాస్తుంటే మా పిల్లలకు ఇంగ్లిషు రావడం లేదని బాధపడే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు మా పిల్లలు కూడా ఇంగ్లిషు పదాలు చెబుతున్నారు.

– దిల్‌షాది బుడ్డనగర్, పాములపాడు మండలం

ఇంగ్లిషులో రైమ్స్ పాడుతున్నారు



నా కూతురు రితిక ప్రియ ఇంగ్లిషులో రైమ్స్ పాడుతుంటే చాలా సంతోషంగా ఉంది. గత సంవత్సరంలో ఆ అలు కూడా రాసేది కాదు. ఈ సంవత్సరం ఇంగ్లిషులో ఏబీసీడీలు, రైమ్స్ పాడుతుంటే మా ఆనందం చెప్పలేనంతా ఉంది. అంగన్‌వాడీ కేంద్రంలో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టిన సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం.

– బేరి రాణి గువ్వలకుంట్ల గ్రామం, కొత్తపల్లి మండలం

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం సబ్‌ట్రెజరీ పరిధిలో ఉన్న పెన్షనర్లు ఆదివారంలోగా తమ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని సబ్‌ట్రెజరీ అధికారి ఆర్.వెంకటరమణ శనివారం తెలిపారు. సబ్ ట్రెజరీ పరిధిలో మొత్తం 792 మంది పెన్షనర్లు ఉండగా శనివారం నాటికి 715 మంది తమ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించారని తెలిపారు. మరో 77మంది ఇంతవరకు సమర్పించలేదన్నారు. ఆదివారం కూడా ట్రెజరీ కార్యాలయం తెరిచే ఉంటుందని, లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించవచ్చని చెప్పారు. స్థానికంగా అందుబాటులో లేని వారు తమకు అందుబాటులో ఉన్న సబ్‌ట్రెజరీ కార్యాలయం, జీవన్ ప్రమాణ్, మీ–సేవాలో సమర్పించుకోవచ్చని తెలిపారు.

ఆరోగ్యసురక్ష శిబిరంలో వైద్య చికిత్సలు



ఆరోగ్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న రోగులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామసచివాలయం –1లో శనివారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 408 మంది రోగులకు వైద్యులు పరీక్షలు జరిపారు. 318 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు, 90 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సాధారణ రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కంటి అద్దాలు అవసరమైనవారికి ఉచితంగా త్వరలో పంపిణీ చేస్తారు. ప్రోగ్రాం అధికారి వరప్రసాద్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలూనాయక్, డాక్టర్లు స్ఫూర్తి తేజ, వినయ్‌రెడ్డి, విజయభార్గవ్, కంటివైద్య నిపుణులు షేక్షావలి, వైద్యసిబ్బంది నజీర్ అహ్మద్, రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరికలు



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న పారుమంచాల కేశవరెడ్డి దివాకర్‌రెడ్డి

- శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని శాప్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామానికి చెందిన సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో కేశవరెడ్డి దివాకర్‌రెడ్డి చేరారు. పార్టీలో చేరిన ఆయనకు సిద్ధార్థరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా ఏరాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి చేసిన సీఎం వైఎస్ జగనన్నకు ప్రజలు పట్టం కట్టాలన్నారు. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన పేద మహిళలకు బటన్ నొక్కి బ్యాంక్ ఖాతాలోకి నగదు జమ చేశారని గుర్తు చేశారు. 58 నెలలో జరిగిన అభివృద్ధి గతంలో ఏ పాలనలో జరగలేదని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి



పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

మహానంది: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులను కల్పించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. మహానంది మండలం తమ్మడపల్లి గ్రామంలోని ఫీడర్ ఛానల్ పనులను శనివారం పరిశీలించి ఫీల్డ్ అసిస్టెంట్స్, ఉపాధి కూలీలతో కలెక్టర్ పలు అంశాలపై చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా లేబర్ బడ్జెట్ మరియు సెల్ఫ్ ఆఫ్ వర్క్స్ ఆధారంగా కుటుంబాలకు, వ్యక్తిగత కూలీలకు ఉపాధి పనులను విరివిగా కల్పించాలన్నారు. పనులకు ఎంతమంది వస్తున్నారు, జాబ్ కార్డులు ఎంత మందికి ఉన్నాయి, చురుకుగా పని చేసే కూలీలు ఎంతమంది ఉన్నారు, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్ ఆపరేట్ చేసే విధానంపై ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవిలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏప్రిల్, మే, జూన్ మాసాలలో ఉపాధి హామీ పనులను ప్రతి కుటుంబానికి కల్పించాలన్నారు. పనులు చేస్తున్న ప్రాంతాలలో కూలీలు వడదెబ్బకు గురికాకుండా షేడ్ నెట్, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తదితరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఉదయం 6 గంటలకే ఉపాధి హామీ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మహానందిలోని పర్యావరణ కేంద్రంలో నర్సరీ ప్లాంట్‌ను పరిశీలించారు.

రన్ ఫర్ జీసెస్ ర్యాలీ



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు

ఆత్మకూరు: ఈస్టర్ పండుగ సందర్భంగా శనివారం పట్టణంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాస్టర్ రాజేంద్రప్రసాద్, పాస్టర్ సుధాకర్ మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలై భవిష్యతును నాశనం చేసుకుంటున్నారని, యువకులు మంచి చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం పట్టణంలోని సీఎస్‌ఐ ప్రార్థనా మందిరం నుంచి కొత్తబస్టాండ్ మీదుగా నంద్యాల టర్నింగ్, ఎస్పీజీపాలెం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో త్యాగరాజు, రమేష్, లింగరాజు, సామేలు, అనిల్, సుధాకర్, సత్యరాజు, డాక్టర్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లాలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యేసుక్రీస్తు పునరుర్థానుడైన విషయాన్ని తెలియజేస్తూ వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సుబ్బయ్య, గోపాల్, సుధాకర్, విజయభాస్కర్, సుంకరాజు తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు, రవికుమార్

ఆత్మకూరు: స్థానిక కోర్టులో శనివారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా రవికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోర్టు ఆవరణలో సీనియర్ న్యాయవాదులు నూర్ అహమ్మద్, పుల్లారెడ్డిల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఇందులో ఉపాధ్యక్షులుగా నూర్‌అహమ్మద్, ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్, ట్రెజరర్‌గా లక్ష్మీనారాయణ, లైబ్రరియన్‌గా చింతలయ్య, మీడియా కార్యదర్శిగా భాస్కర్ ఎన్నికయ్యారు. నూతన సంఘాన్ని బార్ అసోసియేసన్ సభ్యులు సన్మానించారు. సీనియర్ న్యాయవాదులు గోవిందరెడ్డి, చౌదరి, కేశవరెడ్డి, బాలాజీ, గిరిరాజు, శశంకర్, రహిమాన్ అభినందనలు తెలిపారు.

నందికొట్కూరు అధ్యక్షుడిగా వెంకటరాముడు

నందికొట్కూరు : నందికొట్కూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జె.వెంకటరాముడు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి వి.సత్యనారాయణ తెలిపారు. శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో మొత్తం 61 మంది సభ్యులకు గాను 56 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి సీనియర్ న్యాయవాది సీ. విజయ్‌కుమార్‌కు 13 ఓట్లు రాగా జె. వెంకటరాముడు 42 ఓట్లు సాధించి ఎన్నికల్లో విజయం సాధించినట్లు తెలిపారు. కార్యనిర్వహణ సభ్యులు ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా మద్దయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. ఉప కార్యదర్శి పదవి నామినేషన్ తిరస్కరించినందున పదవి ఖాళీ ఉన్నట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటరాముడుకు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

గుండెపోటుతో కన్నడ పాదయాత్రికుడి మృతి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని నాగలూటి వీరభద్ర ఆలయం సమీపంలోని శ్రీశైల శిఖర మెట్ల మార్గంలో వెళ్తున్న పాదయాత్రికుడు శేఖరప్ప(47)శనివారం గుండెపోటుతో మరణించాడు. కర్ణాటకలోని కొప్పల్ జిల్లా ఇనామల్ గ్రామానికి చెందిన శేఖరప్ప ప్రతి ఏడులాగే ఈ సారి కూడా తమ ఉత్తర కర్ణాటక సంప్రదాయంలో భాగంగా శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరాడు. అయితే నాగలూటి నుంచి మెట్లమార్గంపై శిఖరాన్ని అధిరోహిస్తూ తీవ్రమైన అయాసంతో పడిపోయాడు. నాగలూటిలో ఉన్న 108 బృందానికి సమాచారమివ్వడంతో వారు మెట్ల మార్గంలో శేఖరప్ప వద్దకు చేరుకుని పరిశీలించగా అప్పటికే ఆయన గుండెపోటుతో మరణించినట్లు ధ్రువీకరించారు. ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జీతాలు చెల్లించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలు ఇవ్వలేదని వారికి వెంటనే జీతాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు వె.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. శనివారం సచివాలయం–1లో గ్రామపంచాయతీ కార్యదర్శి బాలూనాయక్‌కు వినతి పత్రం సమర్పించారు. రెండు నెలల బకాయి ఉన్న జీతాలు చెల్లించడంతో పాటు, పని భద్రత కల్పించడంతోపాటు ఈపిఎఫ్,ఇఎస్‌ఐ వర్తింపచేయాలని కోరారు. కార్మికులు ఆరోగ్య పరిరక్షణకోసం అవసరమైన శానిటరీ కిట్లను అందజేయాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చేయండి

జూపాడుబంగ్లా: ఎండలతీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి సూచించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి చేతిపంపులకు మరమ్మతులు చేయించుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ఎక్కడా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించకుండా పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు శాంతయ్య, సామేలు, విజయ్‌కుమార్, ఖాజా పాల్గొన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది:మహానందిలో శనివారం వీకెండ్ సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి వచ్చారు. దీంతో పాటు పెళ్లిళ్లు జరగడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. భక్తులరద్దీకి అనుగుణంగా ఈఓ కాపు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు.

భారీగా తగ్గిన తర్తూరు టోల్‌గేటు వేలం

జూపాడుబంగ్లా: తర్తూరు టోల్‌గేటు వేలం పాటలు గతేడాది కంటే ఈ ఏడాది భారీగా తగ్గినట్లు సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, ఈఓపీఆర్డీ మధు మోహనచక్రవర్తి తెలిపారు. ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న తర్తూరు జాతరను పురస్కరించుకొని శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో టోల్‌గేటు వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో కేవలం ముగ్గురు మాత్రమే పాల్గొన్నారు. వేలం పాటల్లో ప్రభాకర్ అనే వ్యక్తి అత్యధికంగా రూ.2,80,000లకు వేలం పాడి టోల్‌గేటు వసూళ్లను దకున్నారు. గతేడాది టోల్‌గేటు వేలం రూ.4లక్షలకు పోగా ఈ ఏడాది కేవలం రూ.2,80,000 లకు మాత్రమే పోవటంతో గ్రామపంచాయతీకి రూ.1,20,000 ల ఆదాయం తగ్గింది. వేలం పాటదారుడు టోల్‌గేటు వసూళ్లను ఏప్రిల్ 16 నుంచి మే 1 వరకు మాత్రమే గ్రామపంచాయతీ నిర్ణయించిన ధరల ప్రకారం మాత్రమే వసూళ్లు చేసుకోవాలని సూచించారు.

లింగ వివక్ష చట్టరీత్యా నేరం

కొత్తపల్లి: ఆడ, మగ తేడా లేకుండా పిల్లలను పెంచడం తల్లిదండ్రుల బాధ్యత అని, లింగ వివక్ష చూపడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు. శనివారం మండలంలోని గుమ్మడాపురం, ఎరమఠం గ్రామాల్లో బేటి బచావో – బేటి పఢావో కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి వినోద్ బాబు, మహిళా పోలీసు వర జ్యోతిలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు హరిత, అంకమ్మ, ధనలక్ష్మి, నానమ్మ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే



వీపనగండ్ల గ్రామంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి దారా సుధీర్

- ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దారాసుధీర్
- వీపనగండ్ల, అలగనూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

మిడుతూరు: చంద్రబాబు ఎన్ని పార్టీలతో జత కట్టినా సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తప్పదని.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని నందికొట్కూరు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ దారా సుధీర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని వీపనగండ్ల, అలగనూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్సీ కాలనీకి చేరుకున్న డాక్టర్ సుధీర్‌కు పూల వర్షం కురిపిస్తూ బాణసంచా పేలుస్తూ స్వాగతం పలికారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అధికారం కోసం చంద్రబాబు నెరవేరని హామీలు ఇస్తున్నారని..వారు అధికారంలోకి వస్తే ప్రభుత్వ పథకాలు రద్దు చేస్తారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు ఏర్పాటు చేసి ఇంటి వద్దకే పాలన అందిస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భారతి, ఎంపీటీసీ కోటేశ్వరరావు, పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణా రెడ్డి, మండల కన్వీనర్ తువ్వా లోకేశ్వరరెడ్డి, మాజీ ఎంపీటీసీ తిమ్మారెడ్డి, నాయకులు రాజేష్, రఘుస్వామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మహేశ్వరయ్య, మాధవరెడ్డి, రమణారెడ్డి, హిమాంవలి, అంజి, రాము, దేవరాజు, నీలికట్టు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



మిట్టకందాలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పాములపాడు: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ అన్నారు. శనివారం మండలంలోని మిట్టకందాల, మద్దూరు, కృష్ణానగర్, వాడాల గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో వర్గ విభేదాలకు తావివ్వరాదన్నారు. ఎవరికి వారు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవడం వల్ల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతాయని అన్నారు. సమస్యాత్మక గ్రామాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇప్పటికే కేసుల్లో ఉన్న వారు ఏ మాత్రం గొడవలకు పాల్పడినా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. ఎస్‌ఐ అశోక్, పోలీసు సిబ్బంది, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సర్వసాధారణం



హెచ్‌ఎం మంగన్నను సన్మానిస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తపల్లి: ఉద్యోగులకు పదవీ విరమణ సర్వసాధారణమని జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని దుద్యాల గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు మంగన్న పదవీ విరమణ సందర్భంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ దుద్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న తమ్మినేని మంగన్న విద్యార్థులపట్ల ప్రేమ భావంతో ఉంటూ విద్యాబుద్ధులు నేర్పారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరాములు,ఉపాధ్యాయ బృందం, వైఎస్సార్‌సీపీ నాయకుడు నంద్యాల ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.